## కొనసాగుతున్న రైతు వారోత్సవాలు



**ఆసిఫాబాద్ టౌన్:** ప్రజా పాలన ప్రగతి రైతు వారోత్సవాల్లో భాగంగా బుధవారం జనకాపూర్ రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అలీ బిన్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు అందే స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు మరియు ట్రాక్టర్ లోన్ల గురించి వివరించారు. రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలని, దళారులను నమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రుకుం ప్రహల్లాద్, ఏవో మిలింద్, బ్యాంక్ మేనేజర్లు వెంకట రవీందర్, తిరుపతి, సెక్రెటరీ వెంకటరమణ, ఏ ఈ ఓలు, రైతులు పాల్గొన్నారు.

## నేరడిగొండలో ఉచిత వైద్య శిబిరం



**నేరడిగొండ:** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెల్త్ సూపర్వైజర్ ఎ.సంతోష్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య సేవలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇలాంటి శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. శిబిరంలో రోగులకు ఉచితంగా రక్తపోటు, మధుమేహం తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్పీలు మౌనిక, వాణి రాథోడ్, ఆశా కార్యకర్తలు జయమ్మ, రజని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో మంత్రి పొంగులేటి



**సత్తుపల్లి:** వేంసూరు మండలంలోని అడసర్లపాడు గ్రామంలో అట్లూరి కుటుంబ వివాహ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అట్లూరి సత్యనారాయణ రెడ్డి– విజయలక్ష్మి దంపతుల కుమారుడు అట్లూరి ప్రసన్న రెడ్డి వివాహానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వ విజయ్ బాబు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగామయి దయానంద్ దంపతులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అలాగే సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఆడే గజేందర్



**గుడిహత్నూర్:** నేరడిగొండ మండలం బొందిడి గ్రామ మాజీ సర్పంచ్ జనార్దన్ కుమార్తె వివాహ వేడుక బుధవారం వారి స్వగ్రామంలో నిర్వహించారు. ఈ శుభకార్యానికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ హాజరయ్యారు. కళ్యాణ వేదికపై నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలో పాల్గొని ఆనందం పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ కె. హరిత**



**చింతలమానేపల్లి :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. బుధవారం చింతలమానపల్లి మండలం గంగాపూర్ గ్రామంలోని బాబాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె హాజరు రిజిస్టర్, మందుల నిల్వ గది, వార్డులు మరియు ఆసుపత్రి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సమయానికి సరైన చికిత్స అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఎండల తీవ్రత దృష్ట్యా ఆసుపత్రిలో సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఎండదెబ్బ తగిలిన వారికి తక్షణమే చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సూపర్వైజర్లు తమ పరిధిలోని గ్రామాలను ప్రతిరోజు సందర్శించి, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలకు ఎండల ప్రభావంపై అవగాహన కల్పించడంతో పాటు, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విధులకు ఆలస్యంగా వచ్చే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

**హై లెవెల్ వంతెన పనుల పరిశీలన**

చింతల మానేపల్లి మండలంలోని దిందా గ్రామం సమీపంలో గల ప్రాణహిత నదిని జిల్లా కలెక్టర్ హరిత పరిశీలించారు. నదిలో నీటి ప్రవాహ వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దిందా గ్రామం వద్ద వాగుపై నిర్మాణంలో ఉన్న హై లెవెల్ వంతెన పనులను పరిశీలించిన కలెక్టర్, పనులను అత్యంత నాణ్యతతో మరియు శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే గ్రామస్తులు చాలా కాలంగా ఎదుర్కొంటున్న రవాణా సమస్య తీరిపోతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వైద్యులు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



# చెక్ పోస్ట్‌ల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ కె. హరిత
- పెద్దబండ అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం ఆకస్మిక తనిఖీ



**సిర్పూర్ (టి) :**
చెక్ పోస్ట్‌ల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. బుధవారం సిర్పూర్ (టి) మండలం పెద్దబండ వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి, వాహనాల రాకపోకల రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, పక్క రాష్ట్రాల నుండి జిల్లాలోకి వరి ధాన్యం అక్రమంగా రవాణా అయ్యే అవకాశం ఉందని, సిబ్బంది ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి పత్రాలను సరిచూడాలని సూచించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో పత్తి సాగు పెరిగే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం నిషేధించిన పత్తి విత్తనాలు, గడ్డి మందుల రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతాల నుంచి మత్తు పదార్థాల అక్రమ రవాణా జరగకుండా సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తనిఖీ కేంద్రాల వద్ద విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని, అక్రమ రవాణాను అరికట్టడంలో రవాణా మరియు పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# నిత్యాన్నదాన సత్రాన్ని అడ్డుకునేందుకు రాజకీయ కుట్ర

**మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప**



**కాగజ్నగర్:** పేద ప్రజలకు ఉచితంగా భోజనం అందిస్తూ కొనసాగుతున్న నిత్య అన్నదాన సత్రాన్ని రాజకీయ కక్షతో అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆరోపించారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదలకు ఒక పూట అన్నం పెడుతున్న సేవా కార్యక్రమం కూడా కొందరికి కడుపుమంటగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు అకస్మాత్తుగా నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా సత్రాన్ని ఖాళీ చేయాలని సూచించడం వెనుక రాజకీయ కుట్ర ఉందని మండిపడ్డారు. 800 గజాల స్థలంలో 1600 గజాలు ఆక్రమించామని చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. "మేము ఒక్క గజం భూమి కూడా ఆక్రమించలేదని, ప్రజల సమక్షంలోనే స్థలాన్ని కొలిచి చూపించామని తెలిపారు. అయినప్పటికీ అసత్య ఆరోపణలతో నోటీసులు ఇవ్వడం విచిత్రంగా ఉందని పేర్కొన్నారు. పేదలకు ఉచితంగా భోజనం అందించే సేవా కార్యక్రమాలను అడ్డుకోవడం బాధాకరమని, ఈ అంశంపై అధికారులు, పాలకులు స్పందించాలని కోరారు. "అన్నదాన సత్రాన్ని మూసివేయించే ప్రయత్నం చేస్తే దేవుడు కూడా క్షమించడని హెచ్చరించారు. ఇద్దరు నాయకులు వెనుక నుంచి ఈ కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు., ఎవరైనా అడ్డుకున్నా తాను పేదలకు అన్నదానం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఒకవేళ 10వ తేదీ లోపు తమ లేఖకు సమాధానం ఇవ్వకపోతే అన్నదాన సత్రం ముందు భారీ స్థాయిలో ధర్నా చేపడతామని ప్రకటించారు.

# ఐటీడీఏ పీఓ కు కలిసిన ఎమ్మెల్యే

**ఉట్నూర్ :** ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మందా మకరందుని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిసిన ఎమ్మెల్యే ఆయనకి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు నార్నూర్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సత్యనారాయణ, సర్పంచ్‌లు దిగంబర్, సకారం, చందు, సురేష్, మాణిక్ రావు, రాహుల్, పైకు, పరమేశ్వర్, రాజంపేట ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి , మాజీ సర్పంచ్‌లు ఊర్వేత రూప్ దేవ్, మడావి రూప్ దేవ్, మాజీ ఉప సర్పంచ్ పడ్ విష్ణు పలువురు నాయకులు పాల్గొన్నారు.



# ఆసిఫాబాద్ నూతన డీఎస్పీకి కలిసిన ప్రజా ప్రతినిధులు



**ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి. అశోక్‌ను బుధవారం ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి డీఎస్పీని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బాలకృష్ణ, సాలం బీన్ అహ్మద్, మాజీ సర్పంచ్ బలరాం నాయక్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నిసార్, సాయి శ్రావణ్ తదితరులు పాల్గొని నూతన డీఎస్పీకి అభినందనలు తెలిపారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ పట్టణంలోని జనకాపూర్ నివాసి ఎమ్ముర్ల పోషం కుమార్తె ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ బీఆర్ఎస్ నాయకులు బుధవారం జనకాపూర్‌లోని వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మరణించిన యువతి చిత్రపటానికి నివాళులర్పించి, అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబం ధైర్యంగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాలం బీన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నిసార్, దూడల అశోక్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

# ఓంకార్ శతజయంతి ముగింపు సభకు జయప్రదం చేయాలి

**వరంగల్:** వరంగల్ జిల్లా నర్సంపేటలో ఈనెల 12న నిర్వహించనున్న యంసిపిఐ(యు) వ్యవస్థాపక నేత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోనె కుమారస్వామి పిలుపునిచ్చారు. గీసుకొండ మండలం మచ్చాపూర్లోని ఓంకార్ స్తూపం వద్ద బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు, సామాజిక శక్తుల ఐక్యతే ఏకైక మార్గమని పేర్కొన్నారు. నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి అనేక ప్రజా ఉద్యమాలకు ఓంకార్ నాయకత్వం దోహదపడిందని, పీడిత ప్రజల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించిందని



తెలిపారు. నర్సంపేట ప్రజలు ఓంకార్ ను ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించడం ఆయన ప్రజాదరణకు నిదర్శనమని కొనియాడారు. శాసనసభను ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మలిచినందుకు ఆయనకు "అసెంబ్లీ టైగర్" అనే పేరు వచ్చిందని గుర్తుచేశారు. కమ్యూనిస్టు-సామాజిక శక్తుల ఐక్యత ద్వారా రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో ఆయన కృషి చేశారని తెలిపారు. ఈనెల 12న సాయంత్రం 4 గంటలకు నర్సంపేట సిటిజన్ క్లబ్ ఆవరణలో జరగనున్న ఈ బహిరంగ సభలో యంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, మాజీ జాతీయ కార్యదర్శి కుల్దీప్ సింగ్, రైతాంగ పోరాట యోధుడు కిరణ్ జిత్ సింగ్ శేఖాన్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర నాయకుడు జి.నాగయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ కన్వీనర్ విమలక్క తదితర ప్రముఖులు హాజరు కానున్నారని వివరించారు. ఈ సభ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థులు, యువత, మహిళలు, కార్మికులు, రైతులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కనకం సంధ్య, సహాయ కార్యదర్శి సురేష్, నాయకులు సోమిడీ రవి, బండి బుచ్చయ్య, ఆదినారాయణ, పుల్చేరు సుధాకర్, పెండ్యాల మల్లయ్య, ఎండి ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన డిఎస్పికి సన్మానం

**ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ నూతన డిఎస్పి గా బి అశోక్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరకుల్లా మంగ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాపర్తి కార్తీక్, వార్డు సభ్యులు గులాం జావిద్, ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షులు ఎండి ఆసిఫ్ అలీ, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ రఫిక్, ఎన్ ఎస్ యూ ఐ నియోజకవర్గ అధ్యక్షుడు జమీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జాలిం షా, అబ్దుల్లా, తాజ్, , బండి సాయి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# సాంకేతిక వ్యవసాయంతో విప్లవాత్మక మార్పులు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్:** వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధనా మండలి సంయుక్తంగా కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహించిన "డ్రోన్ సాంకేతికత ద్వారా నువ్వుల విత్తే విధానం" ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రోన్ ద్వారా విత్తనాలు చల్లే ప్రక్రియను స్వయంగా పరిశించి, డ్రోన్ ఏ విధంగా పనిచేస్తుంది, విత్తనాలను ఎంత వేగంగా, ఎంత సమానంగా చల్లుతుందనే అంశాలపై శాస్త్రవేత్తలు కలెక్టర్ కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సాంప్రదాయ పద్ధతుల్లో విత్తనాలు విత్తడం ద్వారా సమయం, శ్రమతో పాటు విత్తనాల వృథా ఎక్కువగా ఉంటుందని, డ్రోన్ల వాడకం ద్వారా వీటిని సమర్థవంతంగా అధిగమించవచ్చని అన్నారు. డ్రోన్ల ద్వారా విత్తనాలు చల్లడం, మందుల పిచికారీ చేయడంతో కూలీల కొరత సమస్య తీరడమే కాకుండా, సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందని వివరించారు. వినూత్న ఆవిష్కరణలను రైతులకు చేరువ చేసేందుకు జిల్లా యంత్రాంగం, కృషి విజ్ఞాన కేంద్రం నిరంతరం కృషి చేస్తున్నాయని, రైతులు ఈ తరహా ఆధునిక యంత్రాలను వినియోగించుకోవాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ఖర్చు తక్కువతో కూడిన పరిష్కారాలను రైతులకు చూపేందుకు ఈ క్షేత్రస్థాయి ప్రదర్శన ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ ఆత్మ చైర్మన్ కౌడాల నారాయణ, ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త రాంగోపాల్ వర్మ, హకా మేనేజర్ వెంకటేశ్వర్లు, జేడీఏ శ్రీధర్ స్వామి, గ్రామ సర్పంచ్ భూమన్న, రైతు కేమ లక్ష్మణ్, ఏఓ రవీందర్, పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు



**గుడిహత్నూర్:** మండల టాస్క్ ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పలు విత్తన విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో నిర్వహించిన ఈ తనిఖీల్లో విత్తనాల నాణ్యత, నిల్వలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న విత్తన నిల్వలను కంపెనీల వారీగా సరిచూసిన అధికారులు, విక్రయదారుల లైసెన్స్ గడువు తేదీలను తనిఖీ చేశారు. నిబంధనలకు అనుగుణంగా వ్యాపారం నిర్వహించాలని సూచించారు. స్టాక్ బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని, ప్రతి విక్రయాన్ని రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, అనుమతి లేకుండా నిల్వలు ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. రైతులకు సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేసేందుకు టాస్క్ ఫోర్స్ సభ్యుల ఫోన్ నంబర్లతో కూడిన ఫ్లెక్సీలను ప్రతి షాపు ముందు ఏర్పాటు చేశారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్, ఎస్సై శ్రీకాంత్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వినోద్, జీపీఓ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల విజ్ఞాన వికాసానికి 'స్నేహ' శిబిరాలు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్:** గ్రామీణ ప్రాంత విద్యార్థుల విజ్ఞాన వికాసాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో 'స్నేహ వేసవి సెలవుల శిబిరాలు' నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ శిబిరాల సన్నాహకాలపై సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తక పఠనానికి మాత్రమే పరిమితం కాకుండా ఆటపాటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకునేలా శిబిరాలను రూపుదిద్దినట్లు పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో, యునిసెఫ్ సహకారంతో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. మారుమూల గ్రామాల విద్యార్థులకు కూడా ఈ శిబిరాలు అందుబాటులోకి వచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శిబిరాలను విజయవంతం చేయాలని సూచించారు. విద్యార్థులు తమ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఏ పీడీ రవీందర్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇలాంటి జాబ్ మేళాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని యువతకు దిశానిర్దేశం చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు క్రమశిక్షణతో పనిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అంతకుముందు వివిధ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, ఎంపిక ప్రక్రియపై కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, ఉపాధికల్పన అధికారి మిల్కా, యువత, నిరుద్యోగులు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# పదో తరగతి టాపర్లకు నగదు బహుమతులు

**తిర్యాణి:** ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ అనిల్ అన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అనిల్ గౌడ్ నగదు బహుమతులను అందజేశారు. మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను బుధవారం ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనిల్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తేనే వారు మరింత ఉత్సాహంగా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధిస్తారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. బహుమతులు స్వీకరించిన విద్యార్థులు మాట్లాడుతూ తమ విజయానికి ఇది గొప్ప ప్రేరణగా నిలుస్తుందని, మరింత ముందుకు సాగేలా ప్రోత్సాహం అందించిన అనిల్ గౌడ్, అనిల్ అన్న యువ సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# వడదెబ్బతో మహిళ కోమాలోకి

- ఆడే గజేందర్ తక్షణ స్పందనతో మెరుగైన చికిత్స

**గుడిహత్నూర్:** తీవ్రమైన ఎండల ప్రభావంతో గుడిహత్నూర్ మండలం తోషం తండాకు చెందిన జాదవ్ ఘమ బాయి వడదెబ్బకు గురై కోమాలోకి వెళ్లిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. ఎండలో పనిచేస్తుండగా ఒక్కసారిగా అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ స్పందించారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ రాథోడ్ జైసింగ్తో పాటు వైద్య బృందంతో సమన్వయం చేసి బాధితురాలికి అత్యవసరంగా మెరుగైన చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. ఆయన సూచనలతో వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స అందించడంతో ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. ప్రజల కష్టసమయంలో ముందుండే ఆడే గజేందర్ చొరవతో బాధితురాలి ప్రాణాలు కాపాడటానికి కృషి చేయడం పట్ల తోషంతండా వాసులు, నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని, తగినంత నీరు తాగుతూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఆయన వెంట ఆడే జైపాల్ తదితరులు ఉన్నారు.



